ఆంధ్రజ్యోతి ****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 12 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 23.4

గ్యాంగ్‌స్టర్ నయీం

ఆస్తుల జప్తు

హత్యలు, కబ్జాలు, అరాచకాల అలజడి సృష్టించిన నయీం ఆస్తులపై ఈడీ దృష్టి సారించింది. గత ప్రభుత్వం వేసిన సిట్ ఆధారంగా వివరాలు సేకరించి, ఆ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. నయీం ముఠా బెదిరించి స్వాధీనం చేసుకున్న వ్యవసాయ భూము లు, ఇళ్లు, వెంచర్లలోని ప్లాట్ల యజమానులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ ఆస్తులను ఈడీ జప్తు చేసుకోనుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



- ఈడీ నిర్ణయం
- కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న 35ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం
- ఆందోళనలో బాధితులు



బెదిరింపులు, అరాచకాలతో గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమంగా చెరపట్టిన విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. కుటుంబసభ్యులు, బినామీల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 35 ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఈడీ రంగం సిద్ధంచేసింది. 2020 ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్ కౌంటర్‌లో నయీం మృతిచెందాడు. దీంతో అప్పటివరకు నయీం గ్యాంగ్ అరాచకాలను భరించిన బాధితులు పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేశారు. భువనగిరిలోని క్రిస్టియన్ గోస్పెల్ చర్చి ఆస్తులను కూడా నయీం బలవంతంగా తన కుటుంబ సభ్యుల పేరిట రాయించుకున్నాడని ఆ సంస్థ కార్యదర్శి ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పట్లోనే సిట్ ఏర్పాటు ...

నయీం ఆగడాలపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు అప్పట్లోనే ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. ఈ మేరకు చేపట్టిన దర్యాప్తులో నయీం కుటుంబసభ్యులు, బినామీల పేరిట వేలాది ఎకరాల భూములు, అంతే స్థాయిలో ప్లాట్లు, ఇళ్లు ఉన్నట్లు గుర్తించిన సిట్ బృందం ఈడీకి నివేదించింది. మెజారిటీ ఆస్తులు నయీమ్ కుటుంబసభ్యులైన హసీనాబేగం, తాహరాబేగం, సలీం బేగం, అబ్దుల్, సలీం, అహేలా బేగం, సయ్యద్ నిలోఫర్, ఫిరోస్ అంజుమ్, మహమ్మద్ ఆరిఫ్, హసీనా కౌసర్ పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించింది. వీరిలో ఒకరిద్దరూ మృతి చెందినట్లు ప్రచారంలో ఉంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆధారంగా 2020లో ఈడీ మనీ లాండరింగ్ కేసులు నమోదుచేసి పలుమార్లు సమన్లు జారీచేసింది. అలాగే భారీ ఆస్తులు కూడబెట్టినప్పటికీ ఐటీ రిటర్న్స్ దాఖల చేయనట్లు గుర్తించింది. దీంతో ఐటీ శాఖ కూడా నోటీసులను జారీ చేసింది. రిజిస్ట్రేషన్ చిరునామాల ఆధారంగా సమన్లు, నోటీసులు జారీ చేసినప్పటికీ ఎవరు తీసుకోకపోవడంతో చిరునామా ఇళ్ల గోడలపై పలు పర్యాయాలు..

- మిగతా 6వ పేజీలో..



ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌పామ్

రైతులకు ఊరట

ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఆయిల్‌పామ్ రైతులకు రాయితీ నిధులను కేటాయించింది. నల్లగొండ జిల్లాలో 2,217 మంది రైతులకు 9768 ఎకరాలకు రూ.6.14కోట్లు, యాదాద్రి జిల్లాలో మొత్తం 914 మంది రైతులకు 4,107ఎకరాలకు రూ.1.72కోట్లు, సూర్యాపేట జిల్లాలో మొత్తం 1015 మంది రైతులకు 4,457 ఎకరాలకు రూ.1.85కోట్లు రాయితీ మొత్తంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.9.71కోట్లు నాలుగు రోజుల క్రితం మంజూరయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- రాయితీ నిధులు రూ.9.71కోట్లకు పైగా విడుదల
- ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ
- ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించేలా నిర్ణయాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ విస్తరణకోసం ఇటీవల కలెక్టరేట్‌లో మండల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ, ఉద్యానశాఖ అధికారులతోపాటు మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్లు, పతంజలి ఫుడ్ ఫీల్డ్ స్టాఫ్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన పెంచడం, వారికి నచ్చజెప్పి ఈ తోటలు సాగు చేసేలా, రైతులు ముందుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ సాగయితే ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని, ఇందుకు రైతులు ప్రభుత్వం నుంచి ఇస్తున్న రాయితీల దృష్ట్యా ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు తరుచూ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేలా తగిన విధంగా ఆయా శాఖలు ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు వాటి వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, ఉద్యోగుల సహకారం తీసుకుంటూ సాగు విస్తరణకు ముందుకు అడుగులు వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సమృద్ధి అవకాశాలపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ పెంచడంతోపాటు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం ఏటా ఉద్యానశాఖకు లక్ష్యాలను నిర్దేశిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తోంది. తొలి నాలుగేళ్ల వరకు చెట్ల పెరుగుదల ఉండగా, నాలుగో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఎరువులకోసం ప్రభుత్వం రాయితీని అందజేస్తుంది. రైతులకు 2,100 చొప్పున అంతర పంటలు మరో 2,100 చొప్పున సబ్సిడీ నాలుగేళ్లవరకు అందజేస్తుంది. ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు డ్రిప్‌ను కూడా సబ్సిడీపై ఇస్తుంది.

జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు

జిల్లాలో ఇప్పటికే 10,700ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అదనంగా మరో 15వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొస్తే త్వరలో జిల్లాలో ఆయిల్‌పామ్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతోపాటు సంబంధిత కంపెనీ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఫ్యాక్టరీ ఏర్పాటుకు దాదాపు 200 ఎకరాలు అవసరం కాగా, అందులో ఆయిల్‌పామ్ తోటను 50 ఎకరాల్లో ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడానికి, శిక్షణా తరగతులు నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఒక్కో ఎకరానికి 10నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఆయిల్‌పామ్ కంపెనీని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ-సూర్యాపేట జిల్లాల మధ్యలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటు కావాలంటే కనీసం 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు...

- మిగతా 6వ పేజీలో...

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు రూ.6.14కోట్లకు పైగా రాయితీ నిధులను విడుదల చేసింది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. వాటిని ప్రతీ రైతు ఆయిల్‌పామ్ తోటల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలి. ఇకపోతే 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగయితే జిల్లాలో ప్రత్యేకంగా ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది.ఇప్పటికి 10,700 ఎకరాల్లో సాగైంది. మరో 15వేల ఎకరాల్లో తోటలను విస్తరింపజేసేందుకు కలెక్టర్ సూచన, సహకారంతో తోటలు విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నాం.

- పిన్నపురెడ్డి అనంతరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నల్లగొండ

కుల వివక్షపై

పూలే పోరాటం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



జిల్లాకేంద్రంలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండటౌన్,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):కుల వివక్షపై జ్యోతిబా పూలే చేసిన పోరాటం అద్వితీయమని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే జయంతిలో పాల్గొని మాట్లాడారు. విద్య, మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమన్నారు. పూలే సాధించిన ఘనత దేశానికి మార్గదర్శకమైందని, చదువు కోసం, మహిళల సాధికారతకోసం ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. సామాజిక ఉద్యమకారుడిగా, అన్నివర్గాల సమానత్వానికి కృషి చేసిన పూలే సేవలు నేటి సమాజం ఆచరిస్తోందన్నారు. జ్యోతిబాపూలే చేసిన సేవలను నేటి విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

జిల్లాలో ఆరు యంగ్ ఇండియా పాఠశాలలు

రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసి చదువుకునేలా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ ఇలాత్రిపాఠి చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లాకు ఆరు పాఠశాలలు మంజూరయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాల పిల్లలు ఉంటారన్నారు. కష్టపడి చదవటం తప్ప, చదువుకు దగ్గరి దారులు లేవని, విద్యార్థులు బాగా చదవాలని, ప్రతీ ఒక్కరు జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా, సంఘసంస్కర్తగా సేవలందించారని తెలిపారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, కుల వివక్ష, మహిళా విద్యకు కృషి చేసిన జ్యోతిబాపూలే మహనీయుడన్నారు. వారి త్యాగాల ఫలితంగానే సమాజంలో నేడు మార్పులు వచ్చాయని, నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరైనప్పటికీ, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను పూలే విస్తరింపజేశారని, ప్రత్యేకించి మహిళల విద్యకు కృషి చేశారని, అణగారిన కులాలను పైకి తెచ్చేందుకు తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, సంఘాల నాయకులు చక్రహరిరామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరామిరెడ్డి, బీసీ సంక్షేమ సహాయ అధికారి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వయో వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, పింఛన్లు మంజూరు చేయాలని దివ్యాంగులు దరఖాస్తులను అందజేశారు.

తమ పిల్లల నుంచి పోషణ భత్యం ఇప్పించాలని, పిల్లలు తమను పోషించే విధంగా చూడాలని, అలాగే భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వయోవృద్ధులు దరఖాస్తులను సమర్పించారు. మొత్తం 72 మంది దివ్యాంగులు, వయోవృద్ధులు వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, నల్లగొండ, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల బలోపేతానికి

కార్యాచరణ

- 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- 'ఆంధ్రజ్యోతి'తో పశుసంవర్ధకశాఖ జేడీ జీవీ రమేష్



జిల్లాలో పశువులు, జీవాల్లో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు ఇవ్వడానికి పశుసంవర్ధకశాఖ సన్నద్ధమవుతోంది. పాడి ఉత్పత్తులు పెంచుకొని రైతులు ఆర్థికంగా బలోపేతం కావడంకోసం కార్యాచరణ రూపొందించింది. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జీవీ రమేష్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తున్నారు?

జేడీ: ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు ఇవ్వనున్నాం. మొత్తం నాలుగు లక్షల నల్లని, తెల్లని పశువులు ఉన్నాయి. వీటన్నింటికీ ఆయా గ్రామాల్లో టీకాలు ఇచ్చి వ్యాధి నివారణ చేపడుతున్నాం. నెలరోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఎన్ని బృందాలు పాల్గొంటున్నాయి ?

జేడీ: జిల్లావ్యాప్తంగా 90 బృందాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యంకానున్నాయి. ఒక్కో బృందంలో ముగ్గురి నుంచి నలుగురు ఉంటారు. ప్రతీ పశువుకు టీకా ఇవ్వడమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుంది. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రంవేళల్లో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున కొనసాగిస్తాం.

ఆంధ్రజ్యోతి: పాడి ఉత్పత్తుల పెంపునకు తీసుకునే చర్యలు..?

జేడీ: పచ్చిమేతతోనే పాడి ఉత్పత్తులు పెరుగుతాయి. పచ్చిమేతతో డెయిరీఫాం నిర్వహిస్తే పెట్టుబడులు కూడా తగ్గి పాడి ఉత్పత్తులు పెరిగి రైతులకు లాభసాటిగా ఉంటుంది. నాలుగు పశువులు ఉన్న ప్రతీ రైతు ఒక ఎకరం గడ్డి పెంచుకోవాలి.

ఆంధ్రజ్యోతి: రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నారా?

జేడీ: గత ఏడాది 60 టన్నుల విత్తనాలను రైతులకు పంపిణీ చేశాం. 75శాతం రాయితీతో పంపిణీ చేశాం. ఈ ఏడాది కూడా అదే విధంగా రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: కృత్రిమ గర్భధారణకు ఏ విధమైన ప్రణాళిక ఉంది?

జేడీ: మేలు జాతి పశువుల పెంపకం కోసం చర్యలు తీసుకుంటున్నాం. గ్రేడ్ ముర్రా బర్రెలు, సంకరజాతి జెర్సీ ఆవులు, హోల్‌స్టెయిన్ ఫ్రిజియన్ ఆవుల సంతతి పెంపకానికి మీటి సెమన్ ఉపయోగించి పశువుల సంపదను పెంచాలి.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

» కలెక్టర్ ఇలా త్రిపాఠి » ఆడపిల్లలపై వివక్ష వద్దు : ఎమ్మెల్యే బాలునాయక్ » గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భావితరాలను ప్రపంచానికి తీసుకొచ్చే గర్భిణులు పోషణ ఆహారం తీసుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండలో జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణ జాతర, అమ్మ పోషణ, బిడ్డ లాలన అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు డాక్టర్‌ల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. పుట్టే బిడ్డ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పోషక ఆహారంపై దృష్టి సారించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవద్దన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దేవరకొండ ప్రాంతంలో గర్భిణులు, మహిళల రక్తహీనతను దృష్టిలో పెట్టుకొని ఇబ్బందులుపడకుండా ఉండేందుకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆడపిల్ల పట్ల వివక్ష చూపవద్దు: బాలునాయక్

ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మీ అని, ఆడపిల్లలపై వివక్ష చూపవద్దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. 50 ఏళ్ల క్రితం దేవరకొండ పరిసర ప్రాంతాల్లో అంతగా ఆసుపత్రులు లేవని, 90శాతానికి పైగా సాధారణ ప్రసవాలే అయ్యేవన్నారు. ఆ కాలంలో బాగా కష్టపడి పనిచేసేవారని, ప్రస్తుతం ఎలాంటి శారీరక శ్రమ లేకపోవడం, సాంకేతికత పెరిగినందున సిజేరియన్ ప్రసవాల వైపు వెళుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాసరావు, డాక్టర్ శాలిని, డాక్టర్ విజయ్‌లు గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం, తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఏపీడీ శారద, డాక్టర్ రష్మి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీడీపీవో సక్కుబాయి, ఎంపీడీవో డానియెల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే బాలునాయక్‌లు గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు.

మహాత్ముల సేవలను గుర్తించాలి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం, పక్కన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మహాత్ముల సేవలను ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం, బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణంలో చేసిన విశేష కృషి అభినందనీయమన్నారు. సమానత్వం, న్యాయం, విలువలను గౌరవించే విధంగా కాంగ్రెస్ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మహాత్మాగాంధీ శాంతి సందేశం, అంబేడ్కర్ సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలకు కాంగ్రెస్ నాయకులు కట్టుబడి ఉండాలన్నారు. దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.


ఆగని కాచారం మైనింగ్

▸ రైతులు, ప్రజల్లో వ్యతిరేకత ▸ నిలిపివేయాలని స్థానికుల డిమాండ్ ▸ పట్టించుకోని అధికారులు

దేవరకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం కాచారం సర్వే నెంబర్ 13 ప్రభుత్వ భూమిలో మైనింగ్ పనులు ప్రజలు, రైతులు వ్యతిరేకిస్తున్నా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామశివారులోని సర్వే నెంబర్ 13లో 24.7 హెక్టార్లలో ప్రభుత్వ భూమి నవభారత్ క్వారీ మైనింగ్ కంపెనీ అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించింది. పనులు ప్రారంభించక ముందే మైనింగ్ పనులను నిర్వహించవద్దని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేశారు. అయినా మైనింగ్ తవ్వకాలు చేపడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. 2022లో మైనింగ్ తవ్వకాలను చేపట్టవద్దని ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. క్వారీ తవ్వకాలతో గ్రామానికి తీవ్రంగా నష్టం జరుగుతుందని, పొలాలలోని పంటలు దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా మైనింగ్, రెవెన్యూశాఖలు ప్రభుత్వ భూమిలో మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతో పనులు ప్రారంభించారు. దీంతో గ్రామానికి చెందిన న్యాయవాది నిరసనమెట్ల సుందరయ్యతోపాటు గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. మైనింగ్ తవ్వకాలతో పంట పొలాలు దెబ్బతింటాయని, నీరు కలుషితమవుతుందని, పర్యావరణానికి హాని కలుగుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. అనుమతులు రద్దుచేసి వవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మైనింగ్ తవ్వకాలు జరుపుతున్న కాచారం గుట్ట

మైనింగ్ తవ్వకాలతో పర్యావరణానికి హాని



మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి. అనుమతులను రద్దు చేయాలి. గ్రామ సమీపంలోనే గుట్ట ఉండటంతో తవ్వకాలు, బ్లాస్టింగ్ నిర్వహిస్తే పంటలు దెబ్బతింటాయి. గ్రామస్థులు, రైతులు వ్యతిరేకించినా అధికారులు అనుమతులు ఇవ్వడం సరికాదు. హైకోర్టుతో పాటు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం చేయాలి

-నిరసనమెట్ల సుందరయ్య, కాచారం

2032 వరకు అనుమతులు



కాచారం ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 13లో క్వారీ వవ్వకాలకు నవభారత్ కంపెనీ 2032 వరకు అనుమతి తీసుకుంది. మైనింగ్‌శాఖ కూడా అనుమతి ఇచ్చింది. నవభారత్ కంపెనీ తవ్వకాలు చేపట్టింది.

-రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

▸ రూ. 80లక్షల హాషిష్ ఆయిల్ , రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

భువనగిరి రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా హాషిష్ ఆయిల్ ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరు అంత ర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. హైదరాబాద్ మల్కాజిగిరిలోని కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన పెట్లశేఖర్, అనిమిరెడ్డి దుర్గారావు స్నేహితులు. వీరికి అదే జిల్లా గునుగుండ మండలం చెందిన గంజా దుర్గ కూడా స్నేహితుడు. అయితే దుర్గ వీరికి ఆంధ్ర ప్రదేశ్‌లోని తూని రైల్వేస్టేషన్ వద్ద వీరికి 4 కిలోల హాషిష్ ఆయిల్ (3ప్యాకెట్లు) అందజేసి హైదరాబాద్‌లో విక్రయించాలని సూచించాడు. దీంతో వారు మూడు, నాలుగు రైళ్ల మారుతూ శుక్రవారం భువనగిరి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం చౌరస్తా వద్ద ఓ వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి అశిష్ ఆయిల్ ఉన్న బ్యాగును అక్కడ వదిలేసి పరుగెత్తారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ అనుమానం వచ్చి బ్యాగును తెరిచి చూడగా అందులో హాషిష్ ఆయిల్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. 40 నుంచి 50 కిలోల గంజాయిని నుంచి కేజీ హాషిష్ ఆయిల్ తయారవుతుందని చెప్పారు. మొత్తం 4కిలోల హాషిష్ ఆయిల్ 200కిలోల గంజాయి వినియోగించినట్లు, రూ.80లక్షల విలువ ఉటుందని తెలిపారు. ఆయిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు. కాగా వీరికి హాషిష్ ఆయిల్ ను అందజేసిన గంజాదుర్గపై కూడ కేసు నమోదు చేశామని త్వరలో అతడి కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు. పెట్ల శేఖర్, అనిమిరెడ్డి దుర్గారావును భువనగిరి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సమావేశంలో భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఎస్‌వోటీ అడిషినల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ ఉన్నారు.



ముఠా వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుధీర్ బాబు, పక్కన భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, అడిషినల్ డీసీపీ నర్సింహారెడ్డి

అక్రమ పట్టాను రద్దు చేయాలి

● బంధువుల సాయంతో తహసీల్దార్‌ను ఆశ్రయించిన ఓ చిన్నారి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్నేహశ్రీ

మర్రిగూడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమి పట్టా చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ ఓ చిన్నారి తన బంధువులతో కలిసి తహసీల్దార్‌ను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళ్లగా.. నలగొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల నర్సిరెడ్డి, అండాలుకు పిల్లలకు లేరు. దీంతో సమీప బంధువుల వద్ద స్నేహశ్రీని పుట్టిన 15 రోజుల్లోకే 2017లో దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలో కొన్నాళ్ల క్రితం అండాలు అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి తండ్రి నర్సిరెడ్డి స్నేహశ్రీ(8) ఆలనాపాలనా చూస్తున్నాడు. అయితే నర్సిరెడ్డికి గ్రామంలోని సర్వేనంబర్ 383లో 33 గుంటల భూమి ఉన్నది. కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా నర్సిరెడ్డికి మంచానికి పరిమితమయ్యాడు. అయితే ఈనెల 9న నర్సిరెడ్డిని అతడి వజ్రమ్మ(అక్క),సంజీవరెడ్డి తమ్ముడు కలిసి రెవెన్యూ కార్యాలయానికి తీసుకెళ్లి 33గుంటల్లో 30గుంటల భూమిని అజలాపురం గ్రామానికి చెందిన వెలిమినేటి సత్తిరెడ్డికి పేరుమీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో స్నేహశ్రీ బంధువులతో కలిసి వెళ్లి తహసీల్దార్ బక్క శ్రీనివాస్ ముందు కంటతడి పెట్టింది. మా భూమి మాకు ఇప్పించాలని తహసీల్దార్‌ను కోరింది. స్పందించిన తహసీల్దార్ భూమి బ్లాక్ లిస్టు పెడుతున్నానని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్నేహశ్రీకి హామీ ఇచ్చారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్ : యువకుడి మృతి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంట నిలిపిన ట్రాక్టర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం గోప్యానాయక్‌తండా గ్రామానికి చెందిన ముడావత్ పిర్యా (36) పనినిమిత్తం బైక్‌పై హాలియా మండలం సూరేపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులోకి చేరుకోని కుక్కడం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రేఖ గోవింద్ తన ట్రాక్టర్‌ను నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచాడు. దీంతో పిర్యా బైక్‌ను ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయాలపాలైన పీర్యా ను హుటాహుటినా మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా మృతుడి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు ..

ఆలేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్ట పైనుంచి జారి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేటలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దూడల ఆంజనేయులుగౌడ్ (45)రోజు మాదిరిగానే చెట్టుపైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారిపడడంతో కిందపడిపోయాడు. ఈప్రమాదంలో వెన్నుమక, చాతీలోలో తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేసుకున్నాడు. ఈసమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స మృతి చెందాడు. మృతునికి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా : వృద్ధురాలికి గాయాలు

గరిడేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ధాన్యం ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం దొనబండ తండా గ్రామానికి చెందిన భూక్యా గోవింద్ తనకున్న రెండున్నర ఎకరాల వరి పొలం కోసి ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రాలీలో పోసుకొని కల్మల్‌చెర్వు నుంచి మిర్యాలగూడ రైస్ మిల్లుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గరిడేపల్లి నుంచి అలింగాపురం వరకు రోడ్డు వెడల్పు చేసి కొత్తగా తారు వేశారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద గల మూలమలుపు వద్దకు రాగానే మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. అదే మూల మలుపు వద్ద రాపోలు సాయమ్మ గతంలో ధాన్యం ట్రాలీలు బోల్తాపడినప్పుడు పడిన ధాన్యం గింజలు ఎత్తుకుంటుంది. ట్రాలీ పడిపోవడంతో బోరెలో ఉన్న ధాన్యం ఒక్క సారికి వృద్ధురాలిపై పడడంతో నడుము వద్ద దెబ్బ తగిలి రెండు కాళ్లు పనిచేయడం లేదు. స్థానికులు 108కు ఫోన్ చేసి వృద్ధురాలిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.


బోల్తా పడిన ధాన్యం ట్రాలీ రోడ్డుపై వరి ధాన్యం

ఆయిల్‌పామ్ రైతులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

విస్తరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దిగుబడులు ఖమ్మం జిల్లాతో పాటు విజయవాడ ప్రాంతానికి ఆయా కంపెనీలు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం తోటలు వేస్తున్న రైతులు మార్కెటింగ్ సమస్యపై అయోమయానికి గురి కాకుండా ఉండేందుకు ప్రభుత్వం భరోసా ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు పంటలు వేసిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోయేది లేదని స్పష్టత ఇస్తుంది. ఈ తోటల సాగు సులభం కావడంతోపాటు ఆయిల్‌పామ్ తోటలు పండించిన రైతులతో కంపెనీలు ఒప్పందం చేసుకుంటున్నాయి. ధరలు సైతం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడూ నిర్ణయిస్తుండటంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆయిల్‌పామ్‌కు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లాలో నీటి వనరులు అధికంగా ఉండటంతో తోట లు విస్తరించాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.21వేలకు పైగా ఉండగా సంవత్సరానికి ఎకరానికి రూ.1.50లక్షల ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. ఖర్చులు ఎకరానికి సుమారు రూ.60వేలు ఉండగా, వరి పంటతో పోలిస్తే 7 నుంచి 8 రెట్ల అధిక ఆదాయం పొందవచ్చు.


ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

మంజూరైన రాయితీ నిధులు ఇలా...

4సంవత్సరాల తోటలకు	రైతులు	విస్తీర్ణం	సబ్సిడీ రూ.కోట్లల్లో
ఒకటో సంవత్సరం	491	1856	2.820కోట్లు
రెండో సంవత్సరం	934	3933	1.652కోట్లు
మూడో సంవత్సరం	651	3290	1.340కోట్లు
నాలుగో సంవత్సరం	141	789	0.332కోట్లు
మొత్తం	2217	9768	6.144కోట్లు

గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల జప్తు

(5వ పేజీ తరువాయి)

అంటించారు. అయినప్పటికీ ఐదేళ్లుగా ఎలాంటి స్పందన లేకపోవడంతో గుర్తించిన 35 ఆస్తులను జప్తు చేసేందుకు ఈడీ సిద్ధమవుతోంది. ఈ మేరకు శుక్రవారం మీడియాలో వచ్చిన కథనాలు చర్చనీయాంశమయ్యాయి.

భువనగిరి పరిసరాల్లోనే అధికం

నయీం ముఠా చెరబట్టిన ఆస్తులు భువనగిరి పరిసరాల్లో అధికంగా ఉండటం, కొన్నింటిపై బినామీలు లేదా ఇతరులు కబ్జా ఉండటంతో ఆ ఆస్తులు చర్చనీయాంశంగా మారాయి. మరికొన్ని వెంచర్లలోని ప్లాట్‌లను ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గతంలోనే కొనుగోలు చేసినప్పటికీ ఆ తర్వాత ఆ వెంచర్ల యాజమానుల నుంచి నయీం ముఠా తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకుంది. అలాగే మరి కొన్ని భూములను పట్టాదారుల నుంచి నయీం ముఠా నేరుగా తక్కువ ధరకే కొనుగోలు చే సింది. దీంతో బాధితులు అప్పట్లోనే సిట్‌ను ఆశ్రయించి న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 35 ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంతో తాము నష్టపోయిన భూములు ఈడీ స్వాధీనం చేసుకునే జాబితాలో ఉంటే తమ పరిస్థితి ఏమిటని బాధితులు ఆందోళనకు గురవుతున్నట్లు ప్రచారమవుతోంది. న్యాయంకోసం నేటికీ బాధితులు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో అర్జీలు ఇస్తూనే ఉన్నారు. పోలీస్ ఉన్నతాధికారులను కూడా కలుస్తున్నారు. దీంతో ఈడీ స్వాధీనం చేసుకునే 35 ఆస్తుల జాబితా అధికారికంగా వెలువడితేనే ఆస్తుల జప్తుపై స్పష్టత రానుంది. అలాగే జప్తు జాబితాలో లేని ఆస్తుల పరిస్థితి ఏమిటని కూడా పలువురు చర్చించుకుంటున్నారు. అయితే ఈడీ ఆస్తుల జప్తుపై తమకు ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు పేర్కొంటున్నారు. నయీం, అతని ముఠాపై సుమారు 300 బెదిరింపులు, కిడ్నాప్‌లు, అక్రమ వసూళ్లు, భూముల కబ్జా తదితర కేసులు ఉండగా 25 పైగా హత్య కేసులు ఉన్నాయి. అవన్నీ కోర్టులలో విచారణ దశలో ఉన్నాయి.


భువనగిరిలోని నయీం ఇలు

పెంచిన జీతాలు ఇవ్వరా..?

● మునిసిపల్ కార్మికులకు మూడేళ్ల క్రితం ప్రభుత్వం వేతనాల పెంపు
● ఇప్పటి వరకు ఇవ్వని వైనం ● మరణించిన కార్మిక కుటుంబాలకూ అందని పెన్షన్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

అందరూ సుఖనిద్రలోకి జారుకునేవేళ తాము చెమటలు కక్కుతూ పనిచేసి తెల్లవారేసరికి పట్టణాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్న మునిసిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు అందడంలేదు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డులతో, సుమారు 1.50 లక్షకు పైచిలుకు జనాభా కలిగి ఉన్న మిర్యాలగూడ మునిసిపాలిటీకి వివిధ పనులపై సుమారు 30 వేలమందికి ప్రజలు వచ్చిపోతుంటారు. వేలాది వాహనాల రద్దీతో సాయంత్రానికి వీధులన్నీ చెత్తాచెదారాలతో పేరుకపోతుంటాయి.గ్రేడ్‌వన్ మునిసిపాలిటీగా ఉన్న మిర్యాలగూడ పట్టణ ప్రజలకు స్వచ్ఛత పంచుతూ తాము మురికిలో మగ్గుతున్న కార్మి కులకు కనీస అవసరాలైన దుస్తులు, బూట్లు, గ్లౌజులు లాంటి వాటిని కూడా పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. పైగా మునిసిపాలిటీ కార్మికులకు జీతాలు పెంచి మూడేళ్లయినా పెరిగిన జీతం డబ్బులు అందలేదని కార్మికులు తెలిపారు. అంతేకాకుండా కార్మికుల కుటుంబ సభ్యులకు అందాల్సిన పెన్షన్ సైతం ఇవ్వడం లేదని వెట్టి బతుకుల వెల్లదీస్తున్న కార్మిక కుటుంబాల సభ్యులు గోడువెల్లబోసుకుంటున్నారు.

అందని పింఛన్లు

విధి నిర్వహణలో ఉండగానే మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు అందాల్సిన పింఛన్ మంజూరు కావడం లేదని అంటున్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో విధినిర్వహణలో మరణించిన కార్మికులు సుమారు 20 మంది ఉండగా వారికి కుటుంబాల వారికి పీఎఫ్ డబ్బులు తప్ప పింఛణ్ మంజూరు కావడం లేదని, అధికారుల రేపుమాపు అంటూ తిప్పుతున్నారే తప్ప పింఛన్ మంజూరు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతికార్మికుడికి వారి జీతంలో 12 శాతం పీఎఫ్ కింద కటింగ్ అవుతుంది. ఈఎస్ఐ కింద ప్రతినెల రూ.3.50 యజమాని, రూ.1.25 కార్మికుడు చెల్లించాల్సి ఉంది. శాఖాపరమైన పెన్షన్ కాకుండా పీఎఫ్, ఈఎస్ఐ కింద అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెన్షన్ మంజూరు అవుతున్నందున మరణించిన కార్మికుడి భార్యకు, తల్లి దండ్రులకు, మైనర్ పిల్లలకు పెన్షన్ వర్తిస్తుంది. కాగా ఏండ్ల తరబడి కార్మికుల కుటుంబాలకు పెన్షన్ మంజూరు కాలేదని ఆరోపిస్తున్నారు.


చెత్తను ట్రాలీలోకి ఎత్తుతున్న మునిసిపల్ కార్మికులు (ఫైల్)

ఒక్కొక్కరికీ సుమారు రూ.38-40 వేల వరకు బకాయి

మునిసిపాలిటీల కార్మికులకు జీతాలు పెంచుతూ 2021లో ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2021 జూన్ నుంచి పెంచిన వేతనాలను అమలులోకి తెచ్చినప్పటికీ 2022 మే నుంచి పెరిగిన వేతనాల ప్రకారంమునిసిపల్ అధికారులు కార్మికులకు జీతాలు చెల్లిస్తూ వచ్చారు. అవుట్ సోర్సింగ్ కమాటీలు 310 మంది, 14 మంది జవాన్‌లు, ట్రాక్టర్ డైవర్స్, చెత్తబండ్ల డ్రైవ ర్లు, హెల్పర్లు కలిసి మరో 36 మంది వరకు కార్మికులు ఉన్నారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు 11 నెలలు పెరిగిన జీతాలు ఇవ్వాల్సి ఉండగా మూడేళ్లయినా చెల్లించడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.38-40 వేల వరకు పెరిగిన జీతాలకు సంబంధించిన డబ్బులు రావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈ ఏడాదికి సంబంధించి కార్మికులకు సబ్బు లు, కొబ్బెరినూనె పంపిణీ చేసినప్పటికీ మూడేళ్లుగా బట్టలు, బూట్లు, గ్లౌజ్‌లు కార్మికులకు అందంజేయలేదని అంటున్నారు.

బిల్లులు ట్రెజరరీకి పంపాం



2023లో అప్పటి కమిషనర్ కార్మికులకు పెరిగిన జీతాల డబ్బులను చెల్లించలేదు. కార్మికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచినపై అధికారుల ఆదేశా నుసారం ఏరియర్స్‌కు సంబంధించి బిల్లు తయారు చేసి ట్రెజరరీకి పంపడం జరిగింది. త్వరలోనే వేతన బకాయిలను చెల్లిస్తాం.

- ఎండీ యూసూఫ్, మునిసిపల్ కమిషనర్ , మిర్యాలగూడ

పెన్షన్ మంజూరి కాలేదు



నా భర్త మేకల నాగరాజు మున్సిపాలిటీలో పనిచేస్తూ 2023లో చని పోయాడు. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంతవరకు మంజూరు చేయలేదు. ఇద్దరు పిల్లలను చదివిం చలేక, కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నా.

-మేకల రాణి, కార్మిక కుటుంబ సభ్యురాలు

బూట్లు, గ్లౌజులు ఇవ్వలేదు



మూడేళ్ల క్రితం పెరిగిన జీతాలుకు సంబంధించి 11 నెలల జీతాలు కార్మికులు మంజూరు చేయలేదు. మూడేళ్లకు సంబంధించి బట్టలు, బూట్లు, గ్లౌజులు ఇవ్వలేదు. అరకొర జీతాలు బతు కులు వెళ్లదీస్తున్నా.

- తిరుపతి రాంమూర్తి, మునిసిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు

ఇటుకబట్టీలపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో లింగారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గంధ్రవానిగూడెం గ్రామాన్ని కాలుష్యానికి గురి చేస్తున్న ఇటుకబట్టీల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన కొణతం చిన్నలింగారెడ్డి కోరారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో వట్లాడారు. గంధ్రవానిగూడెం శివారులో సుమారు 100 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా 10 మంది కాంట్రాక్టర్లు ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్నారని అన్నారు. కనీసం కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టక పోవడంతో బట్టీల నుంచి దుమ్ము ధూళి, ఇటుకల బట్టీలు కాల్చుతున్నప్పుడు వెలువడే పొగతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన సబ్ కలెక్టర్ విచారణ చేసి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని తహసీల్దార్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధుల కోత దారుణం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో నిధుల కోత విధించిందని ఇది దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య విమర్శించారు. నల్లగొండ జిల్లి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ఉపాధిహామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పనుతున్నదని, ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నదన్నారు. ఏడెనిమిదేళ్లలో కూలీలకు పనిముట్లు ఇవ్వడంలేదని పని ప్రదేశాల్లో మౌలిక వసతులను కల్పించడంలేదని తాగునీటిని అందుబాటులో ఉంచకపోవ డం సిగ్గుచేటన్నారు. పథకంలో పనిచేసే కూలీలకు వేసవి అలవెన్సులను మూడేళ్లుగా ఇవ్వకు ండా నిలిపేశారని అన్నారు. ఎ వెంటనే పెండింగ్‌లో ఉన్న వేసవి అలవెన్స్ కూలీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధిహామీ కూలీల గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా అనగంటి అలివేలు, ఉపాధ్యక్షులుగా మోర ఇందిర, ఏర్పుల మల్లేశ్వరి, కార్యదర్శిగా బడే లివణ్య, కార్యదర్శిగా ఏర్పుల సైదమ్మతో పాటు మరో 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సం ఘం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, ఏర్పుల దామోదర్, ఆనగంటి అలివేలు, ఏర్పుల సైదమ్మ, మోర ఇందిర, మల్లేశ్వరి, లావణ్య, శిల్ప, శ్రావ్య, మంజుల, తిరుపతమ్మ, స్వాతి పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో నారి అయిలయ్య



విద్యార్థులకు మేలు చేకూర్చనున్న పీఎం శ్రీ



» విద్యార్థులకు ప్రేరణ, అనుభవం కల్పన
» పీఎం శ్రీకి జిల్లా నుంచి 31 పాఠశాలలు ఎంపిక

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. రైజింగ్ ఇండియా కోసం ప్రధాన మంత్రి పాఠశాలల పేరుతో పీఎంశ్రీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ)పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2022 సెప్టెంబరు ఏడో తేదీన ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాఠశాలలు ఎంతో బలోపేతం కానున్నాయి. ఈ పథకంతో ప్రతి విద్యార్థి అనేక రంగాల్లో తనదైన ప్రతిభ కనబర్చుతాడు. అప్‌గ్రేడ్ చేసిన మౌలిక సదుపాయాలు, వినూత్న బోధన, సాంకేతికతతో పీఎంశ్రీ పాఠశాలలు ఆదర్శంగా ఉంటాయి. ఈ పాఠశాలలు తమ పరిసరాల పాఠశాలకు మార్గదర్శకత్వం, నాయకత్వం వహిస్తాయి. వీటిని గ్రీన్స్ స్కూల్స్‌గా అభివృద్ధి చేస్తారు. ముఖ్యంగా ఎల్‌ఈడీ లైట్లు, సౌర శక్తి, సహజ వ్యవసాయంతో పోషకాహార తోటలు, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రహితం, నీటి సంరక్షణ, పంట కోత, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులకు సంబంధించిన హ్యాకథాన్ వంటి అనేక పర్యావరణ అనుకూల అంశాలను కలుపుకుని అభివృద్ధి చేస్తారు. ఈ పీఎంశ్రీ పథకానికి పాఠశాలల ఎంపిక ఛాలెంజ్ పద్ధతిలో జరుగుతుంది. పాఠశాలలు ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలలు ఎంపిక కోసం జియో ట్యాగింగ్ చేస్తారు. కనీస బెంచ్ మార్కు ఆధారంగా పీఎంశ్రీని పాఠశాలను ఎంపిక చేస్తారు.

పీఎంశ్రీతో పాఠశాలలు అభివృద్ధి



జిల్లాలో 31పాఠశాలలు పీఎం శ్రీకి ఎంపికయ్యాయి. పీఎంశ్రీతో పాఠశాలలు, విద్యార్థులు అనేక నూతన విధానాలు నేర్చుకోవడానికి వీలుకలుగుతుంది.

- అశోక్, జిల్లా విద్యాధికారి

పీఎంశ్రీతో విద్యార్థులకు ఎంతో మేలు

ఈ పీఎంశ్రీ పథకంతో విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది. ముఖ్యంగా పాఠశాలలు ఆదర్శవంత మైన పాఠశాలలుగా మార్చుచెందే అవకాశం ఉంది. ఈపీఎంశ్రీతో తమ పక్కన ఉన్న పాఠశాల స్థితిగతులు అధ్యయం చేయడానికి, నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి అవకాశం ఉంది. దీంతో పాఠశాలల మధ్య పోటీతత్వం పెరిగి ఆదర్శ పాఠశాలలుగా మారే అవకాశం ఉంది. పీఎంశ్రీ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులతో స్నేహ పూర్వక ఫర్నీచర్, బాల ఫీచర్, జాదుయి పిటార, ప్రీస్కూల్ విద్యలో మద్దతు, అవుట్ డోర్ ప్లే మెటీరియల్స్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, బయాలజీ ల్యాబ్, స్కిల్ ల్యాబ్, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిళ్లు, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల కోసం సుసంపన్నమైన క్రీడా సౌకర్యాలతో కూడిన మైదానం వంటివి ఈ పీఎంశ్రీ పథకం ద్వారా అమలు చేస్తారు.

జిల్లా నుంచి 31 పాఠశాలలు ఎంపిక

పీఎంశ్రీ పథకానికి జిల్లాలో 31 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో ఫేజ్-1లో 22 పాఠశాలలు ఫేజ్-2లో తొమ్మిది పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈపాఠశాలల్లో 10వేల మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హులయ్యారు. ఈ పథకానికి ఈ విద్యాసంవత్సరానికి రూ.33కోట్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా విద్యార్థుల, పాఠశాలల అభివృద్ధి ఎంతో వేగంగా జరగనుంది. ఈ నిధులు 60శాతం కేంద్ర ప్రభుత్వం, 40శాతం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తాయి. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా విధానాన్ని విద్యార్థులు అక్కడ పర్యటించి తెలుసుకోవచ్చు. అంతేకాకుండా ఆగస్టు 15 వంటి వేడుకలను కూడా పీఎంశ్రీ పథకం ద్వారా విద్యార్థులు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం ప్రాథమిక పాఠశాలలు 680, ప్రాథమికోన్నత 78, జడ్పీ ఉన్నత 182, ఆదర్శ పాఠశాలు 9, కేజీబీవీలు 18 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 66,998 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

రాలిన మామిడి, సపోటా కాయలు



గాలివానకు రాలిన మామిడి కాయలు

మోత్కూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :గురువారం రాత్రి ఈదురు గాలులు వర్షానికి బుజిలాపురంలోని రైతు చింతల విజయభాస్కర్ రెడ్డికి చెందిన 12 ఎకరాలలోని మామిడి తోటలో విపరీతంగా కాయలు రాలాయి. అలాగే రెండు ఎకరాల్లో సపోటా కూడా విపరీతంగా రాలిపోయింది. సుమారుగా మామిడి తోట 12 ఎకరాల్లో రూ. 9లక్షల మేర నష్టం వాటిల్లగా, సపోటా రెండెకరాల్లో రెండు లక్షల మేర నష్టం వచ్చినట్లు రైతు చింతల విజయభాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాయలతో పాటు పలుచోట్ల గాలులకు కొమ్మలు కూడా విరిగిపడ్డాయి. రాలిన మామిడికాయలు ఏరేందుకు కూలీలను కూడా భరించే పరిస్థితి లేదని, రాలిన కాయలు మార్కెట్‌లో ఎవరూ కొనరని దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో పది రోజుల్లో కాయలు కోసుకొని స్థితిలో ఉన్నందున ఇప్పుడు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఈ అకాల ఈదురు గాలులు వర్షంతో నష్టపోయామని పేర్కొన్నారు.

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి) : మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ఘనిపల్లి గ్రామానికి చెందిన రైతులు గాదె ప్రతాప్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న పంట మొత్తం నేలమట్టం అయింది. ఇప్పుడిప్పుడే కంకి పడుతుండడంతో 13 ఎకరాల పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన, ఊంజల్ సేవోత్సవం



ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు.

26న శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శని త్రయోదశి సందర్భంగా ఈనెల 26న మండల శివారులోని కృష్ణానది తీరంలో ని బౌద్ధమ దేవాలయంలో శనీశ్వరునికి శని పూజ, శివుడికి అభిషేకం, సూర్యనారాయణ స్వామికి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు యడవెల్లి రఘురామశర్మ శుక్రవారం తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న వైద్య పరీక్షలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులలో చూపు, మానసిక సమస్యలను గుర్తించి చికిత్సలు అందించే లక్ష్యంతో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్ర్కీనింగ్ క్యాంపులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 901 అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 సంవత్సరాల వయుసు గల 36,084 పిల్లలకు ఎనిమిది బీఆర్‌ఎస్‌కే బృందాలు నేత్ర పరీక్షలు చేసి 42 ప్రశ్నలతో వారి మానసిక స్థితిని అంచనా వేస్తున్నారు. ఈ క్యాంపులను డీఎంహెచ్‌వో మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు పర్యవేక్షిస్తున్నారు.

గుట్టుగా మల్లేపల్లి సంత వేలం?

● బహిరంగంగా వేలంతో ఆదాయం పెరిగేదని స్థానికుల అభిప్రాయం



కొండమల్లేపల్లి సంత

దేవరకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద పశువుల సంతగా పేరు గాంచిన కొండమల్లేపల్లి పశువులసంత వేలంపాట గుట్టుగా స్థానిక ప్రజలకు పూర్తిస్థాయిలో సమాచారం అందకుండా నిర్వహించారు. దీంతో స్థానికులు సమాచారం అందిస్తే వేలంపాటలో పాల్గొనేవారమని దీంతో గ్రామపంచాయతీకి మరింత ఆదాయం పెరిగి ఉండేదని తెలుపుతున్నారు. కొన్నేళ్లుగా కొండమల్లేపల్లి పశువుల సంతను ఒకే కుటుంబానికి చెందినవారు నిర్వహిస్తున్నారు. కొండమల్లేపల్లి పశువులసంత గడువు మార్చి 31వ తేదీన ముగిసింది. దీంతో అధికారులు పూర్తిస్థాయిలో స్థానికులకు, ఇతరులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా వేలంపాట నిర్వహించి రూ.1.20 కోట్లకు పాత గుత్తేదారుకు చెందిన వ్యక్తికే అప్పగించారు. బహిరంగంగా వేలంపాట నిర్వహించవలసి ఉండగా గుట్టుగా నిర్వహించడానికి అంతర్యం ఏమిటోనని కొండమల్లేపల్లిలో స్థానికులు చర్చించుకుంటున్నారు. కొండమల్లేపల్లి పశువులసంత ఒకే కుటుంబానికి చెందినవారు గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారని, బహిరంగ వేలం నిర్వహించాలని కొందరు వ్యక్తులు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోపాటు హైకోర్టును ఆశ్రయించారు. బహిరంగ వేలంపాట నిర్వహించాలని హైకోర్టు కూడా ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ అధికారులు ఐదుగురి వద్ద డీడీలు కట్టించుకొని తాము అనుకున్నవారికే టెండర్ దక్కేలా చేశారని చర్చించుకుంటున్నారు. కాగా జిల్లాలోనే అతిపెద్ద పశువుల సంత అయిన కొండమల్లేపల్లి సంతకు ప్రతీ ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు మహబూబ్‌నగర్, గుంటూరు, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన రైతులు, వ్యాపారులు సంతకు వచ్చి క్రయ, విక్రయాలు జరుపుతుంటారు. సంత వేలంపాట దక్కించుకున్న కాంట్రాక్టర్ సంతలో వ్యాపారులకు, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదు. గొర్రెలకు, మేకలకు, పశువులకు రూ.150కిపైగా వసూళ్లు చేస్తున్నారు. ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ సంతలో సౌకర్యాలు కల్పించడంలేదని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని సంతకు వచ్చిన వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలమేరకు వేలంపాట

జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు కొండమల్లేపల్లి పశువుల సంత వేలంపాటను నిబంధనలమేరకు ఎంపీడీవో, ఈవోలు నిర్వహించారు. రూ.1.20 కోట్లకు వేలంపాటను కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. సంతకు వచ్చిన ఆదాయాన్ని గ్రామపంచాయతీ అభివృద్ధికి కెటాయించనున్నారు. నిబంధనల మేరకే వేలంపాట జరిగింది.

-శంకర్‌నాయక్, డీఎల్‌పీవో, దేవరకొండ

30ఏళ్లకే బీపీ, షుగర్

● జిల్లాలో పెరుగుతున్న ఎన్సీడీ రోగులు
● 58వేల మందికి బీపీ, 28వేల మందికి షుగర్
● 367 మందికి క్యాన్సర్ నిర్ధారణ
● కట్టడి చేయకపోతే కొత్త రోగాల ముప్పు
● ఆహారపు అలవాట్లే కారణమంటున్న వైద్యులు

జిల్లాలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. గతంలో 50 నుంచి 60 ఏళ్లకు వచ్చే ఈ వ్యాధులు ఇటీవలి కాలంలో 30 ఏళ్లు దాటగానే వస్తున్నాయి. రోజువారీ జీవితంలో ఆహారపు అలవాట్లకుతోడు నేటి ఆధునిక జీవనశైలి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఒక్కసారి బీపీ, షుగర్ వస్తే జీవితాంతం అవసరమైన మందులు వాడుతూ ఇబ్బందులు పడాల్సిందేనని, అంతేకాకుండా ఇవి అనేక కొత్త రకాల రోగాలతోపాటు గుండెపోటుకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి కలెక్టరేట్)





రోజురోజుకూ పెరుగుతున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్సీడీ) ప్రజల ఆధునిక జీవనశైలిలో మార్పులతోనే అధికమవుతున్నాయని, నేషనల్ హెల్త్ మిషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. వీటి నియంత్రణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య శాఖ ద్వారా సర్వేలు నిర్వహిస్తూ ఎన్‌సీడీ క్లినిక్‌లను కూడా ఏర్పాటు చేసింది. 2011 జనగణన ప్రకారం జిల్లాలో 7.26 లక్షలకు పైగా జనాభా ఉంది. వీరికి నాలుగు ఎన్సీడీ క్లినిక్‌లతోపాటు ఇప్పటి వరకు 3,53,657 మందిని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్ర్కీనింగ్ చేశారు. ఇందులో 58,228 మందికి రక్తపోటు (బీపీ), 28,739 మందికి షుగర్ (డయాబెటీస్) ఉన్నట్లు తేలింది. బాధితుల్లో 30నుంచి 60 ఏళ్లలోపు వారు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. 90శాతం జీవన శైలిలో మార్పులతో, 10శాతం మందికి మాత్రమే జెనెటికల్‌గా వచ్చినట్లు ప్రాథమికంగా అంచనావేశారు. బాధితులకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తూ నెలరోజులకు సరిపడా మందులను ప్రతీనెల అందిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు.

పెరుగుతున్న క్యాన్సర్ పేషెంట్లు

క్యాన్సర్ రోగులశాతం కూడా జిల్లాలో క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్యశాఖ సర్వే ద్వారా తెలుస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 367 మంది క్యాన్సర్ రోగులున్నారు. వారిలో 86 మందికి ఓరల్ క్యాన్సర్, 172 మందికి బ్రెస్ట్ క్యాన్సర్, 109 మందికి సర్వైకల్ క్యాన్సర్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. క్యాన్సర్ రోగుల కోసం భువనగిరి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) పాలియేటివ్ వార్డులో ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫిజియోథెరపిస్టు అందుబాటులో ఉండి రోగులకు చికిత్స అందిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి జిల్లా ఆసుపత్రి నుంచి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రితో పాటుగా హైదరాబాద్‌లోని వివిధ హాస్పిటల్స్‌కు రెఫర్ చేస్తామని వైద్యులు తెలిపారు.

శారీరక, మానసిక ఒత్తిడితోనే సమస్య



నిర్ణీత సమయం 8 గంటల కంటే ఎక్కువగా పని చేస్తూ శారీరక, మానసిక ఒత్తిడికి గురి కావడం... వాకింగ్, జాగింగ్, యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయకపోవడంతో బీపీ, షుగర్ వస్తాయి. సరైన పోషకాహారం తీసుకోకపోవడం... చక్కర, ఉప్పు, నూనె ఎక్కువగా వాడటం...జంక్ ఫుడ్ తినడంతో బరువు పెరగడం (ఒబేసిటీ) వల్ల కూడా ఈ వ్యాధులు వస్తున్నాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన బీపీ , షుగర్ పేషెంట్లు, ఇప్పుడు గ్రామాలలోనూ బీపీ షుగర్ పేషెంట్లు ఉన్నారు. అధిక బీపీతో గుండెపోటు సంభవించే ప్రమాదం ఉంది. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయడం, ఒత్తిడీని తగ్గించుకోవడం ద్వారా బీపీ షుగర్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు..

-డాక్టర్ సమన్ కళ్యాణ్, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, యాదాద్రి భువనగిరి జిల్లా

బాలసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన

భువనగిరి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరి బైపాస్ రోడ్డులో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాలసదనం భవనానికి కలెక్టర్ ఎం.హనుమంతరావు, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిపాదిత భవన నిర్మాణం పూర్తయితే అనాథ పిల్లలకు మరింత భద్రత లభిస్తుందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు భవనాల అద్దెభారం తప్పుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, సీడీపీఓ శైలజ పాల్గొన్నారు.

25వ తేదీ లోపు బుద్ధవనం, విజయవిహార్ ఆధునికీకరణ పూర్తి చేయాలి



బుద్ధవనం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ

నాగార్జున సాగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఉన్న బుద్ధవనం, విజయవిహార్‌ల ఆధునికీకరణ పనులను ఈ నెల 25వ తేదీ లోపు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో బుద్ధవనం, విజయవిహార్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలను మే నెల 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆసియా దేశాలకు చెందిన 30మంది మిస్ వరల్డ్ పోటీదారులు బుద్ధ పూర్ణిమ సందర్భంగా మే 12వ తేదీన సాగర్‌లో ఉన్న బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధ పూర్ణిమ ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4:30 గంటలకు సాగర్ విజయవిహార్‌కు చేరుకుని, 5:30 గంటల వరకు అక్కడ విశ్రాంతి తీసుకుంటారని, 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు బుద్ధవనంలో నిర్వహించే బుద్ధపూర్ణిమ ఉత్సవాల్లో పాల్గొని తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళతారని తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధవనం, విజయవిహార్‌లను ఆధునికరిస్తున్నామని, ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు మరో 15 రోజుల్లో పూర్తవుతాయన్నారు ఈ మేరకు రెవెన్యూ, విద్యుత్, పోలీస్, పంచాయితీరాజ్, ఈవెంట్ అధికారులతో బుద్ధవనం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ వెంట బుద్ధవనం ఓఎస్‌డీ మదుసూధన్‌రెడ్డి, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్ సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐ సంపత్, ఎస్‌ఈ భాస్కర్‌రావు, డీఈ దామోదర్‌రెడ్డి, ఈవెంట్ మేనేజర్ హరీష్, నందికొండ మునిసిపల్ కమిషనర్ శ్రీను, కాంట్రాక్టర్ల నరసింహారావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిలిచిన సర్వర్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మదద్దిరాలలోని మీసేవా కేంద్రంలో రద్దీ

మద్దిరాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఈ నెల 14తో ముగియనుంది. గడువు సమీపిస్తుండడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంది. ఈనెల 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉన్నాయి. దీంతో మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మీ సేవా కేంద్రాల్లో సర్వర్ రానందున ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఒక వైపు ఎండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. సర్వర్ పని చేయకపోవడంతో మండల కేంద్రంలో మీ సేవా కేంద్రానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మీ సేవా కేంద్రంలో మధ్యాహ్నం మూడు గంటల వరకు సర్వర్ రానందున ప్రజలు అక్కడే పడిగాపులు కాచారు. కుప్పలు కుప్పలు దరఖాస్తులు వస్తుండడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఉదయం నుంచి పడిగాపులు



రాజీవ్‌యువ వికాసం పథకానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వేచి ఉన్నాం. సర్వర్ పని చేయకపోవడంతో మీ సేవ కేంద్రం వద్ద ఉన్నాం. ఎండకు తట్టుకోలేకపోతున్నాం.

● మామిడి శ్రీనివాస్ చందుపట్ల గ్రామం

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

● రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సుధాకర్‌రెడ్డి

నల్లగొండరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రైతు సంఘం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు రైతు సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసినట్లు తెలిపారు. రైతుల కోసం రైతు విమోచన చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యాసంగి సీజన్‌లో మిల్లర్లు అన్ని రకాల పంటలు కొనుగోలు చేసే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో 13నెలల పాటు రైతులు ఉద్యమాలు చేశారని, వాటి స్ఫూర్తితో భవిష్యత్తులో రైతులు మరింత బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, కుంభం కృష్ణారెడ్డి, ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, నకరికంటి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి మారయ్య

కేతేపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కార్మికుల వేతనాన్ని రూ.6వందలకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లూర్దుమారయ్య డిమాండ్ చేశారు. కేతేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ కార్మికులు చేపడుతున్న పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పని దినాలను ఏడాదికి 200 వందల రోజులు పెంచాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస మండల కార్యదర్శి చెవుగోని నాగయ్య, నాయకులు యాదయ్య, జెయాదయ్య, పిచ్చయ్య, మల్లయ్య, నాగయ్య, పద్మ పాల్గొన్నారు.

శాలిగౌరారం మార్కెట్ అభివృద్ధికి కృషి

శాలిగౌరారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మార్కెట్ కమిటీ పాలక మండలి సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో ఇప్పటి వరకు వచ్చిన ఆదాయ, వ్యయాలను చర్చించారు. మార్కెట్ నిర్మించిన నూతన కార్యాలయ భవన నిర్మాణంను ప్రారంభించాలని, మార్కెట్‌లో సీసీ రోడ్లు నిర్మాణం, ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రైతులకు ఇంకా మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వ నిధుల మంజూరు కోసం కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి చీనా నాయక్, వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పౌష్టికాహారం




కొండాపురం అంగన్‌వాడీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ

చండూరురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు చిరుధాన్యాలతో పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ సూచించారు. పోషణ పక్షం, పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు వంటి ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, ఎదుగుదల వంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ భూతం ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి పాండురంగ, ఏఎన్‌ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్లు రమణ, నాగమణి, ఆయాలు పాల్గొన్నారు.

● కనగల్: చిరుధాన్యాలను ప్రతిఒక్కరూ ఆహారంలో భాగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మండలంలోని చెట్లచెన్నారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడాలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారం అందిస్తే రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, సూర్యకళ, సుకన్య, చంద్రకళ, మంగ, శైలజ పాల్గొన్నారు.

కురుమ సంఘం భవనానికి నిధులు మంజూరు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

గట్టుప్పల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గొల్ల కురుమ సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని కురుమ సంఘం నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కోరారు. మండలానికి చెందిన సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రూ.5లక్షల నిధులు మంజూరు చేసి వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే గొర్ల కాపరుల ఖాతాల ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని వారు కోరారు. గొర్ల కాపరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కుండె సత్తయ్య, నాయకులు గుండె మహేష్, మందుల నరసింహ, బండారు శ్రీశైలం, కుండె రమేష్, మందుల నరేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ప్రారంభమయ్యేనా?



నాంపల్లి మండల కేంద్రంలో వృథాగా ఉన్న బాలికల హాస్టల్ భవనం

- సొంత భవనం ఉన్నా నిరుపయోగం
- వృథాగా బాలికల హాస్టల్ భవనం
- విద్యార్థులు, సిబ్బంది లేరని మూసివేత
- హాస్టల్ వసతి లేకపోవడంతో బాలికల ఇబ్బందులు

నాంపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద బాలికలకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తే వారు చదువుకుంటారని భావించిన అప్పటి ప్రభుత్వాలు దాదాపు 40సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో బాలికలకోసం ఎస్సీ హాస్టల్‌ను మంజూరు చేసింది. సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహించింది. ఆఅద్దె భవనంలోనే చుట్టు పక్కల గ్రామాలకు చెందిన బాలికలతో పాటు ఇతర మండలాలకు చెందిన బాలికలు హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసించారు. 2006వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి బాలికలకు మండల కేంద్రంలో పక్కా భవనాన్ని నిర్మించింది. బాలికలకు సొంత భవనం ఉండటంతో హాస్టల్‌లో ఉంటూ బాలికలు చదువుకున్నారు. ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న వారు ఉన్నతస్థాయికి ఎదిగి స్థిరపడ్డారు. హాస్టల్‌లో సిబ్బంది కొరత ఉంది. అంతేకాక నిర్వహణ బాధ్యతలు చేపట్టే వార్డెన్లకు మూడు, నాలుగు హాస్టళ్లకు ఇన్‌చార్జీలుగా నియమించడంతో వారికి పని భారం పెరిగింది. దీంతో హాస్టల్‌లో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం పెరిగింది. దీంతో క్రమక్రమంగా హాస్టల్‌లో బాలికల శాతం తగ్గుతూ వచ్చింది. విద్యార్థినులు తక్కువ మంది ఉండటంతో ఎస్సీ బాలికల హాస్టల్‌ను అధికారులు ఈ విద్యా సంవత్సరం మూసివేశారు. మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండటంతో అందులో చదివే బాలికలకు హాస్టల్ వసతి లేకపోవడంతో కొందరు మధ్యలో చదువును మానివేసి ఇంటి దగ్గరే ఉంటూ కూలీ పనులకు పోతున్నారు. బస్ సౌకర్యం ఉన్న బాలికలు బస్సులో లేనివారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ రోజు ఇంటి వెళ్లి వస్తూ చదువును కొనసాగిస్తున్నారు. ఇలా ప్రయాణాలు సాగిస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాలికల హాస్టల్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హాస్టల్ సిబ్బందిని నియమించి, రానున్న విద్య సంవత్సరానికి హాస్టల్‌ను ఓపెన్ చేసి బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

జూన్‌లో బాలికలను చేర్చుకుంటాం

ఈ విద్యా సంవత్సరం స్కూల్ ప్రారంభంలోనే హాస్టల్‌లో బాలికలను చేర్చుకుంటాం. సిబ్బంది కొరత ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారు సానుకూలంగా స్పందించి ప్రస్తుతం ప్రభుత్వం హాస్టల్ సిబ్బంది నియామకాలు చేపడుతుంది. ఈ హాస్టల్‌కు కూడా సిబ్బందిని నియమిస్తున్నందున జూన్‌లో ప్రారంభిస్తాం.

● రుణాదేవి, హాస్టల్ ఇన్‌చార్జి

సిబ్బంది కొరత లేకుండా చూడాలి



బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వచ్చే విద్యా సంవత్సరానికి బాలికలను హాస్టల్లో చేర్పించి వారికి వసతులతో పాటు సిబ్బంది కొరత లేకుండా అధికారులు చూడాలి. ఎంతోమంది బాలికలకు ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి ఉపయోగపడిన హాస్టల్‌ను మరల అందుబాటులోకి తేవాలి.

- బాషిపాక రాములు, మాజీ సర్పంచ్, సుంకిశాల

విద్యకు దూరమయ్యే అవకాశం



ఇప్పుడిప్పుడే బాలికలు పలు రంగాల్లో రాణిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని బాలికలు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకొని గొప్పగా ఉండాలనుకొని భావిస్తుంటారు. కాని వారి ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులకు గురిచేస్తాయి. వారి తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి హాస్టల్‌ను తెరవడానికి కృషి చేయాలి.

- పూదరి సైదులు, నాంపల్లి

ఎల్లమ్మ తల్లికి విశేష పూజలు



ఎల్లమ్మ అమ్మవారు

కనగల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె ఒడిబియ్యం బోనవైవేద్యాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఉదయం అమ్మవారికి విశేషంగా అలకరించి ప్రత్యేకపూజలు జరిపి సింహహారతి ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, ఈవో జయరామయ్య, పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

విగ్రహ ఏర్పాటు పనులను నిలిపివేయాలి

మర్రిగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేటిచందాపురం గ్రామంలో పాఠశాల సమీపంలో అనుమతి లేకుండా చేపడుతున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులను నిలిపివేయాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్‌కు కలెక్టర్ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంపీవో రవి కుమార్ కలిసి విగ్రహం నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడ విచారణ నిర్వహించారు. నిర్మాణం చేపడుతున్న స్థలం ఆర్ అండ్‌బీకి సంబంధించినది ఆ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టకూడదని మాజీ సర్పంచ్ ప్రసన్నరవికుమార్‌కు ఆదేశించారు. విచారణ అనంతరం ఈ నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

● జిల్లాలో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మహాత్మాజ్యోతిబా పూలే ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగుల విద్య కోసం అనేక గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారని అన్నారు. కార్యక్రమంలో నాయ కులు చీర పంకజ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రెగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, పార్టీ పట్టణ అ ధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు లోడంగి గోవర్ధన్, కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, తుమ్మల లింగస్వామి, వెంకన్న, కనగల్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు

● కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చలపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీడీవో జ్యోతిలక్ష్మి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ గాదరి సుందరయ్య, సీనియర్ అసిస్టెంట్ ఆకుల వెంకన్న, వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సామజిక సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

● చండూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బండారు యాదగిరి పూలే చిత్రపటానికి పూలమాలలు నివాళురల్పించారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలోని సావిత్రీబాయి పూలే గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవో నాగిరెడ్డి, ఎంపీవో మాధవరెడ్డి, సూపరింటెండెంట్ నర్సింహ, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం పుల్లయ్య, కార్యాలయ సిబ్బంది, తుమ్మలపల్లి గ్రామంలో గున్‌రెడ్డి రామలింగారెడ్డి, బోయపల్లి రాజు, యాదయ్య, శివకోటి, వినోద్ కుమార్, అజయ్ పాల్గొన్నారు.

● చిట్యాలలో పూలే జయంతిని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఏర్పుల పరమేశం, ఎస్‌కే ఇబ్రహీం, గుండాల నరేష్‌గౌడ్, మాన శ్రీనివాస్, జిట్ట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, డీసీసీ, ఓబీసీ జిల్లా కార్యదర్శులు వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, లింగయ్య యాదవ్, నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, సైదులు, ఆరేళ్ల సైదులు, మిర్యాల వెంకన్న, తాటికొండ సైదులు, జంగిలి నాగరాజు, భాస్కర్, అంజయ్యగౌడ్, లింగస్వామి, శ్రీనుయాదవ్, పరమేశం పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో వివిధ పార్టీల ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, సీపీఎం నాయకులు రాచకొండ వెంకట్, వంటెపాక వెంకటేశ్వర్లు, లింగయ్య, కాశీరాం పాల్గొన్నారు.

● చిట్యాల మండలం వెలిమినేడులో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మల్లం మహేష్, అరూరి దుర్గయ్య, ఆడెపు రమేష్, సుర్కంటి మోహన్‌రెడ్డి, అరూరి శంభయ్య, దేశబోయిన లింగస్వామి, దేశబోయిన నర్సింహ, బసవయ్య, గోలి సాయికిరణ్, నర్సింహ, లింగయ్య, రాంరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● కనగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో డీటీ పార్వతమ్మ, ఆర్ఐలు సునీత, యాదగిరి, ఎస్ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి, జేఏ లతీఫ్ సిబ్బంది పద్మ, పరమేశ్వరి, సరిత, రాంబాబు, రాజు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నకిరేకల్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే వీరేశం



నల్లగొండలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, నాయకులు

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



ఆకారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి

శాలిగౌరారం, ఏప్రిల్ 11 (ఆం ధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పా దూరి శంకర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరా రం మండలం ఆకారం గ్రామం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారీల వద్ద మోసపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, ఐకేపీ ఏపీఎం ధర్నెబోయిన రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వలిశెట్టి సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గైగుళ్ల అవిలయ్య, ఐకేపీ సీసీ బాలు, వీవోఏ ఇంద్రకంటి శ్రీకన్య, సంఘబంధం అధ్యక్షురాలు తోటకూరి యాదమ్మ, పార్వతమ్మ, స్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శివన్నగూడ వ్యవసాయ రైతు సేవ సహకార పరపతి సంఘం చైర్మన్ బాలం నరసింహ అన్నారు. శుక్రవారం మండలంలోని శివన్నగూడ రైతు సేవ వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధా న్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి బోనస్ పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో ఖుదాబక్షపల్లి, శివన్నగూడ గ్రామాల్లో రెండు కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ రంగినేని యాదగిరిరావు, మేతరి యాదయ్య, రవీందర్‌రెడ్డి, సూర్య, పొగాకు నరసింహ, యాదయ్య, రాములు, లావణ్య, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బాలం నరసింహ

సన్నబియ్యం పేద కుటుంబాలకు వరం



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం


కేతేపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం రాష్ట్రంలోని పేద కుటుంబాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో శుక్రవారం ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. పేద కుటుంబాలు సైతం సన్న బియ్యం భోజనం చేయాలనే లక్ష్యంతో ఆర్థికంగా భారమైనా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు గుత్తా మాధవరెడ్డి, మట్టి సాల్మన్, కోట పుల్లయ్య, డి.సాయిరెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడలో ముత్యాలమ్మ దేవాలయం నిర్మాణం కోసం శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 13 వార్డు కౌన్సిలర్ ఊట్కూరు వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బీపంగి జగ్జీవన్‌రాం, ప్రధాన కార్యదర్శి బీపంగి వినోద్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి మేడి యాదయ్య, బీపంగి భాస్కర్, కార్యవర్గ సభ్యులు బీపంగి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 23.4

గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల జప్తు

హత్యలు, కబ్జాలు, అరాచకాల అలజడి సృష్టించిన నయీం ఆస్తులపై ఈడీ దృష్టి సారించింది. గత ప్రభుత్వం వేసిన సిట్ ఆధారంగా వివరాలు సేకరించి, ఆ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. నయీం ముఠా బెదిరించి స్వాధీనం చేసుకున్న వ్యవసాయ భూము లు, ఇళ్లు, వెంచర్లలోని ప్లాట్ల యజమానులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ ఆస్తులను ఈడీ జప్తు చేసుకోనుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

» ఈడీ నిర్ణయం
» కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న 35ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం
» ఆందోళనలో బాధితులు





బెదిరింపులు, అరాచకాలతో గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమంగా చెరపట్టిన విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధమైంది. కుటుంబసభ్యులు, బినామీల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 35 ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఈడీ రంగం సిద్ధంచేసింది. 2020 ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్ కౌంటర్‌లో నయీం మృతిచెందాడు. దీంతో అప్పటివరకు నయీం గ్యాంగ్ అరాచకాలను భరించిన బాధితులు పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేశారు. భువనగిరిలోని క్రిస్టియన్ గోస్పెల్ చర్చి ఆస్తులను కూడా నయీం బలవంతంగా తన కుటుంబ సభ్యుల పేరిట రాయించుకున్నాడని ఆ సంస్థ కార్యదర్శి ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పట్లోనే సిట్ ఏర్పాటు ...

నయీం ఆగడాలపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు అప్పట్లోనే ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. ఈ మేరకు చేపట్టిన దర్యాప్తులో నయీం కుటుంబసభ్యులు, బినామీల పేరిట వేలాది ఎకరాల భూములు, అంతే స్థాయిలో ప్లాట్లు, ఇళ్లు ఉన్నట్లు గుర్తించిన సిట్ బృందం ఈడీకి నివేదించింది. మెజారిటీ ఆస్తులు నయీమ్ కుటుంబసభ్యులైన హసీనాబేగం, తాహరాబేగం, సలీం బేగం, అబ్దుల్, సలీం, అహేలా బేగం, సయ్యద్ నిలోఫర్, ఫిర్దోస్ అంజుమ్, మహమ్మద్ ఆరిఫ్, హసీనా కౌసర్ పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించింది. వీరిలో ఒకరిద్దరూ మృతి చెందినట్లు ప్రచారంలో ఉంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆధారంగా 2020లో ఈడీ మనీ లాండరింగ్ కేసులు నమోదుచేసి పలుమార్లు సమాన్లు జారీచేసింది. అలాగే భారీ ఆస్తులు కూడబెట్టినప్పటికీ ఐటీ రిటర్న్స్ దాఖల చేయనట్లు గుర్తించింది. దీంతో ఐటీ శాఖ కూడా నోటీసులను జారీ చేసింది. రిజిస్ట్రేషన్ చిరునామాల ఆధారంగా సమన్లు, నోటీసులు జారీ చేసినప్పటికీ ఎవరు తీసుకోకపోవడంతో చిరునామా ఇళ్ల గోడలపై పలు పర్యాయాలు..

- మిగతా 6వ పేజీలో..



ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌పామ్ రైతులకు ఊరట

ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఆయిల్ పామ్ రైతులకు రాయితీ నిధులను కేటాయించింది. నల్లగొండ జిల్లాలో 2,217 మంది రైతులకు 9768 ఎకరాలకు రూ.6.14కోట్లు, యాదాద్రి జిల్లాలో మొత్తం 914 మంది రైతులకు 4,107ఎకరాలకు రూ.1.72కోట్లు, సూర్యాపేట జిల్లాలో మొత్తం 1015 మంది రైతులకు 4,457 ఎకరాలకు రూ.1.85కోట్లు రాయితీ మొత్తంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.9.71కోట్లు నాలుగు రోజుల క్రితం మంజూరయ్యాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

» రాయితీ నిధులు రూ.9.71కోట్లకు పైగా విడుదల
» ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ
» ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించేలా నిర్ణయాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ విస్తరణకోసం ఇటీవల కలెక్టరేట్‌లో మండల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ, ఉద్యానశాఖ అధికారులతోపాటు మైక్రో ఇరిగేషన్ జిల్లా కోఆర్డినేటర్లు, పతంజలి ఫుడ్ ఫీల్డ్ స్టాఫ్‌తో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన పెంచడం, వారికి నచ్చజెప్పి ఈ తోటలు సాగు చేసేలా, రైతులు ముందుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ సాగయితే ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని, ఇందుకు రైతులు ప్రభుత్వం నుంచి ఇస్తున్న రాయితీల దృష్ట్యా ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు తరుచూ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగును విస్తరింపజేసేలా తగిన విధంగా ఆయా శాఖలు ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు వాటి వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, ఉద్యోగుల సహకారం తీసుకుంటూ సాగు విస్తరణకు ముందుకు అడుగులు వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సమృద్ధి అవకాశాలపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ పెంచడంతోపాటు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం ఏటా ఉద్యానశాఖకు లక్ష్యాలను నిర్దేశిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తోంది. తొలి నాలుగేళ్ల వరకు చెట్ల పెరుగుదల ఉండగా, నాలుగో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఎరువులకోసం ప్రభుత్వం రాయితీని అందజేస్తుంది. రైతులకు 2,100 చొప్పున అంతర పంటలు మరో 2,100 చొప్పున సబ్సిడీ నాలుగేళ్లవరకు అందజేస్తుంది. ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు డ్రిప్‌ను కూడా సబ్సిడీపై ఇస్తుంది.

జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు

జిల్లాలో ఇప్పటికే 10,700ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అదనంగా మరో 15వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొస్తే త్వరలో జిల్లాలో ఆయిల్‌పామ్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతోపాటు సంబంధిత కంపెనీ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఫ్యాక్టరీ ఏర్పాటుకు దాదాపు 200 ఎకరాలు అవసరం కాగా, అందులో ఆయిల్‌పామ్ తోటను 50 ఎకరాల్లో ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడానికి, శిక్షణా తరగతులు నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఒక్కో ఎకరానికి 10నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఆయిల్‌పామ్ కంపెనీని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ-సూర్యాపేట జిల్లాల మధ్యలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటు కావాలంటే కనీసం 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు...

- మిగతా 6వ పేజీలో...

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు రూ.6.14కోట్లకు పైగా రాయితీ నిధులను విడుదల చేసింది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. వాటిని ప్రతీ రైతు ఆయిల్‌పామ్ తోటల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలి. ఇకపోతే 25వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగయితే జిల్లాలో ప్రత్యేకంగా ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది.ఇప్పటికి 10,700 ఎకరాల్లో సాగైంది. మరో 15వేల ఎకరాల్లో తోటలను విస్తరింపజేసేందుకు కలెక్టర్ సూచన, సహకారంతో తోటలు విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నాం.

- పిన్నపురెడ్డి అనంతరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నల్లగొండ

కుల వివక్షపై పూలే పోరాటం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



జిల్లాకేంద్రంలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండటౌన్,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):కుల వివక్షపై జ్యోతిబా పూలే చేసిన పోరాటం అద్వితీయమని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే జయంతిలో పాల్గొని మాట్లాడారు. విద్య, మహిళల బలోపేతానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి అపూర్వమన్నారు. పూలే సాధించిన ఘనత దేశానికి మార్గదర్శకమైందని, చదువు కోసం, మహిళల సాధికారతకోసం ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. సామాజిక ఉద్యమకారుడిగా, అన్నివర్గాల సమానత్వానికి కృషి చేసిన పూలే సేవలు నేటి సమాజం ఆచరిస్తోందన్నారు. జ్యోతిబాపూలే చేసిన సేవలను నేటి విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

జిల్లాలో ఆరు యంగ్ ఇండియా పాఠశాలలు

రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసి చదువుకునేలా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ ఇలాత్రిపాఠి చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లాకు ఆరు పాఠశాలలు మంజూరయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాల పిల్లలు ఉంటారన్నారు. కష్టపడి చదవటం తప్ప, చదువుకు దగ్గరి దారులు లేవని, విద్యార్థులు బాగా చదవాలని, ప్రతీ ఒక్కరు జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా, సంఘసంస్కర్తగా సేవలందించారని తెలిపారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, కుల వివక్ష, మహిళా విద్యకు కృషి చేసిన జ్యోతిబాపూలే మహనీయుడన్నారు. వారి త్యాగాల ఫలితంగానే సమాజంలో నేడు మార్పులు వచ్చాయని, నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరైనప్పటికీ, మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను పూలే విస్తరింపజేశారని, ప్రత్యేకించి మహిళల విద్యకు కృషి చేశారని, అణగారిన కులాలను పైకి తెచ్చేందుకు తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, సంఘాల నాయకులు చక్రహరిరామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరామిరెడ్డి, బీసీ సంక్షేమ సహాయ అధికారి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వయో వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, పింఛన్లు మంజూరు చేయాలని దివ్యాంగులు దరఖాస్తులను అందజేశారు.

తమ పిల్లల నుంచి పోషణ భత్యం ఇప్పించాలని, పిల్లలు తమను పోషించే విధంగా చూడాలని, అలాగే భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వయోవృద్ధులు దరఖాస్తులను సమర్పించారు. మొత్తం 72 మంది దివ్యాంగులు, వయోవృద్ధులు వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, నల్లగొండ, దేవరకొండ, చండూరు ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల బలోపేతానికి కార్యాచరణ

» 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
» 'ఆంధ్రజ్యోతి'తో పశుసంవర్ధకశాఖ జేడీ జీవీ రమేష్



జిల్లాలో పశువులు, జీవాల్లో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు ఇవ్వడానికి పశుసంవర్ధకశాఖ సన్నద్ధమవుతోంది. పాడి ఉత్పత్తులు పెంచుకొని రైతులు ఆర్థికంగా బలోపేతం కావడంకోసం కార్యాచరణ రూపొందించింది. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జీవీ రమేష్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తున్నారు?

జేడీ: ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు ఇవ్వనున్నాం. మొత్తం నాలుగు లక్షల నల్లని, తెల్లని పశువులు ఉన్నాయి. వీటన్నింటికీ ఆయా గ్రామాల్లో టీకాలు ఇచ్చి వ్యాధి నివారణ చేపడుతున్నాం. నెలరోజులపాటు సాగే ఈ కార్యక్రమాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఎన్ని బృందాలు పాల్గొంటున్నాయి ?

జేడీ: జిల్లావ్యాప్తంగా 90 బృందాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యంకానున్నాయి. ఒక్కొ బృందంలో ముగ్గురి నుంచి నలుగురు ఉంటారు. ప్రతీ పశువుకు టీకా ఇవ్వడమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుంది. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రంవేళల్లో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున కొనసాగిస్తాం.

ఆంధ్రజ్యోతి: పాడి ఉత్పత్తుల పెంపునకు తీసుకునే చర్యలు..?

జేడీ: పచ్చిమేతతోనే పాడి ఉత్పత్తులు పెరుగుతాయి. పచ్చిమేతతో డెయిరీఫాం నిర్వహిస్తే పెట్టుబడులు కూడా తగ్గి పాడి ఉత్పత్తులు పెరిగి రైతులకు లాభసాటిగా ఉంటుంది. నాలుగు పశువులు ఉన్న ప్రతీ రైతు ఒక ఎకరం గడ్డి పెంచుకోవాలి.

ఆంధ్రజ్యోతి: రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నారా?

జేడీ: గత ఏడాది 60 టన్నుల విత్తనాలను రైతులకు పంపిణీ చేశాం. 75శాతం రాయితీతో పంపిణీ చేశాం. ఈ ఏడాది కూడా అదే విధంగా రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: కృత్రిమ గర్భధారణకు ఏ విధమైన ప్రణాళిక ఉంది?

జేడీ: మేలు జాతి పశువుల పెంపకం కోసం చర్యలు తీసుకుంటున్నాం. గ్రేడ్ ముర్రా బర్రెలు, సంకరజాతి జెర్సీ ఆవులు, పోల్‌స్టెయిన్ ఫ్రిజియన్ ఆవుల సంతతి పెంపకానికి మేటి సెమన్ ఉపయోగించి పశువుల సంపదను పెంచాలి.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

» కలెక్టర్ ఇలా త్రిపాఠి » ఆడపిల్లలపై వివక్ష వద్దు : ఎమ్మెల్యే బాలునాయక్ » గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భావితరాలను ప్రపంచానికి తీసుకొచ్చే గర్భిణులు పోషణ ఆహారం తీసుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండలో జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణ జాతర, అమ్మ పోషణ, బిడ్డ లాలన అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు డాక్టర్ల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. పుట్టే బిడ్డ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పోషక ఆహారంపై దృష్టి సారించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవద్దన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దేవరకొండ ప్రాంతంలో గర్భిణులు, మహిళల రక్తహీనతను దృష్టిలో పెట్టుకొని ఇబ్బందులుపడకుండా ఉండేందుకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆడపిల్ల పట్ల వివక్ష చూపవద్దు: బాలునాయక్

ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మీ అని, ఆడపిల్లలపై వివక్ష చూపవద్దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. 50 ఏళ్ల క్రితం దేవరకొండ పరిసర ప్రాంతాల్లో అంతగా ఆసుపత్రులు లేవని, 90శాతానికి పైగా సాధారణ ప్రసవాలే అయ్యేవన్నారు. ఆ కాలంలో బాగా కష్టపడి పనిచేసేవారని, ప్రస్తుతం ఎలాంటి శారీరక శ్రమ లేకపోవడం, సాంకేతికత పెరిగినందున సిజేరియన్ ప్రసవాల వైపు వెళుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాసరావు, డాక్టర్ శాలిని, డాక్టర్ విజయ్‌లు గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం, తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఏపీడీ శారద, డాక్టర్ రష్మి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీడీపీవో సక్కుబాయి, ఎంపీడీవో డానియెల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే బాలునాయక్‌లు గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు.

మహాత్ముల సేవలను గుర్తించాలి



నకిరేకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం, పక్కన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మహాత్ముల సేవలను ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం, బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణంలో చేసిన విశేష కృషి అభినందనీయమన్నారు. సమానత్వం, న్యాయం, విలువలను గౌరవించే విధంగా కాంగ్రెస్ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మహాత్మాగాంధీ శాంతి సందేశం, అంబేడ్కర్ సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలకు కాంగ్రెస్ నాయకులు కట్టుబడి ఉండాలన్నారు. దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ : కమిషనర్

హాలియా, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీ పరిధిలోని గృహ, ఆస్తిదారులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ముందుగానే చెల్లించే వారికి 5శాతం రాయితీ మంజూరు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మునిసిపల్ పరిపాలనకు సహకరించాలని ఆయన కోరారు. పట్టణ ప్రజలు ఆస్తి పన్నును తక్షణమే చెల్లించి రాయితీని పొందాలని అన్నారు.

ధాన్యం సేకరణలో అక్రమాలను ఉపేక్షించం

గుర్రంపోడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో అక్రమాలను ఉపేక్షించేది లేదని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి నిర్ణీత మిల్లులకు పంపాలని ఆయన సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

డాక్టర్ అరవింద్, వైద్యాధికారి, నిడమనూరు



మండలంలోని గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని నిడమనూరు మండల వైద్యాధికారి డాక్టర్ అరవింద్ తెలిపారు. ఓపీ సేవలు, మందుల లభ్యత, ఉప కేంద్రాల పనితీరు, సిబ్బంది కొరత తదితర అంశాల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. (ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీ ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

వైద్యాధికారి: పేద ప్రజలకు పీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది పీహెచ్‌సీలో అన్ని వేళలా పేషంట్లకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీ 24 గంటలు పని చేస్తుందా?

వైద్యాధికారి: పీహెచ్‌సీ 24 గంటలు పనిచేస్తుంది. రాత్రివేళలో కూడా వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

ఆంధ్రజ్యోతి: అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

వైద్యాధికారి: దాదాపుగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. పాముకాటు, కుక్కకాటుకు కూడా అవసరమైన మందులు లభిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారా?

వైద్యాధికారి: వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ వైద్య సేవలు అందిస్తున్నాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉప కేంద్రాల పని తీరు ఎలా ఉంది?

వైద్యాధికారి: పీహెచ్‌సీ పరిధిలో మండలంలో 10 ఉప కేంద్రాలు ఉన్నాయి. సబ్ సెంటర్లలో కొంతమేరకు సిబ్బంది కొరత ఉన్నప్పటికీ గ్రామాల్లో వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరింది కదా?

వైద్యాధికారి: భవనం శిథిలావస్థకు చేరి అప్పుడప్పుడు పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న విషయం వాస్తవమే. నూతన భవన నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. కలెక్టర్, డీఎంహెచ్‌వోలు ఇటీవల భవన నిర్మాణాన్ని పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

రోడ్డుపైనే మాంసం విక్రయాలు

- ఎక్కడపడితే అక్కడే వ్యర్థాల పారబోత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



పీటీ నగర్‌లో చేపల విక్రయాలు



చింతపల్లిలోని హైవే సమీపంలో మాంసం విక్రయాలు

(ఆంధ్రజ్యోతి - చింతపల్లి)

మండలకేంద్రంలో మాంసం విక్రయ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపైనే పక్కనే మటన్, చికెన్, చేపల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడే జంతువులను వధించి మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. పశు వైద్యాధికారి క్షేత్రస్థాయిలో దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపణ వినిపిస్తున్నాయి.

అంతే కాకుండా రోడ్డు పక్కనే విక్రయిస్తుండటంతో దుమ్ము, ధూళి చేరడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. మండలంలో దాదాపుగా 60 వరకు మాంసం దుకాణాలు ఉన్నాయి. అయితే లాక్‌డౌన్ కారణంగా ప్రజల్లో భయందోళనతో నాన్‌వెజ్ విక్రయాలు బాగా తగ్గాయి. అనంతరం పరిణామాలతో మాంస విక్రయాలు బాగా పెరిగాయి.

ప్రజలకు తప్పని తిప్పలు

చింతపల్లి మండల కేంద్రంలో ప్రత్యేకంగా మాంసం మార్కెట్ లేకపోవడంతో వల్ల రోడ్డు సమీపంలో విక్రయాలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం మార్కెట్ యార్డులో 80రేకుల దుకాణాల నిర్మించడంతో అందులో కేవలం కూర గాయల వ్యాపారస్థులకు ఉపయోగపడుతుంది. మాంసం విక్రయించే వారికి ఏర్పాటు చేయడం పోవడంతో ఇలా రోడ్డు పక్కనే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా మాంస వ్యాపారులు వ్యర్థాలు ఎక్కడికక్కడే వేయడంతో వెలువడే దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని నాణ్యతా ప్రమాణాలతో కూడిన మాంసం విక్రయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి



మటన్, చికెన్, చేపల వ్యాపారస్థులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి మాంసం వ్యాపారస్థులకు జంతు వధశాల ఏర్పాటు చేయాలి. ఈగలు, దోమలు ప్రబల సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

- శివర్ల రమేష్‌యాదవ్, చింతపల్లి

నిబంధనలు పాటించని వారిపై చర్యలు



నాణ్యతా ప్రమాణాలు పాటించని మాంసం వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై జంతు వధ చేయడం, అపరిశుభ్ర వాతావరణం కల్పించడం సరికాదు. జంతు వధశాల ఏర్పాటు చేసేందుకు తగిన నివేది తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తా.

- సుజాత, ఎంపీడీవో, చింతపల్లి

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల దినేష్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి విస్తరణలో భాగంగా మండలకేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్ నేటికి ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు రోడ్డు వెంట నడుస్తూ ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులు బ్యాంకు సేవలతో పాటు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ షేక్ షమీమ్ అన్నారు. శుక్రవారం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన బోదాసు అలివేలు అనారోగ్యంతో మరణించింది. ఆమె అంగడిపేట ఎక్స్‌రోడ్డు టీజీజీవీబీ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకం కింద సంవత్సరానికి రూ.436 కట్టడంతో ఆమె కుటుంబసభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. అలాగే సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఆనంద్, క్యాషియర్ మనోజ్, కృష్ణ బ్యాంకు మిత్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

● సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్



మాస్టర్ కార్తీకేయకు సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్

మిర్యాలగూడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చదరంగం లాంటి క్రీడలతో మేధోవికాసం కలుగుతుందని సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ అన్నారు. శుక్రవారం డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెస్ సమ్మర్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందు కు ఇలాంటి క్యాంపులు ఉపయోగపడతాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆ లోచనలకు తగినట్లుగా ఫ్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని సూచించారు. చెస్‌లో వి ద్యార్థులు రాణించాలని ఆకాక్షించారు. అనంతరం డైమండ్ చెస్ అకాడమీ విద్యార్థి గుండా కార్తీకేయ చదరంగంలో నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అం దజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారిణి, డైమండ్ చెస్ అకాడమీ నిర్వాహకురాలు మాశెట్టి దివ్యశ్రీ, దామరచర్ల తహసీల్దార్ జవహర్‌లాల్, డైమండ్ నేత్రనిధి స్థాపకులు మాశెట్టి శ్రీనివాస్, మాశెట్టి గీత తదితరులు పాల్గొన్నారు.


దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి



నిడమనూరులో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

నిడమనూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న 11 కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికవర్గం సిద్ధం కావాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాల రాసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అథోగతి పాలైందని విమర్శించారు. మే డేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మొదట మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో సంఘం నాయకులు కొండేటి శ్రీను, కొమాండ్ల గుర్వయ్య, కందుకూరి కోటేష్, ఆకారపు నరేష్, నల్లబోతు సోమ య్య, చంద్రశేఖర్, వింజమూరి శివ, బాలనారాయణ, వెంకటమ్మ, చిత్రం శ్రీను, పుల్లయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం, రాజవరం గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి ఎప్పటికప్పుడు కాంటాలు వేసి సకాలంలో మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎలకాని సత్యం, దేశ్య బాలునాయక్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీవీ.రమణరాజు, సునీతకృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భిక్షానాయక్, రంగసాయి, కృష్ణప్రసాద్, లింగారెడ్డి, సత్యంరెడ్డి, దుర్గారెడ్డి, రాజు, పెద లచ్చయ్య, రవీంద్రచారి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

నిడమనూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ చైర్మన్ అంకతి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఉన్నందున రైతుల, కార్మికుల దప్పిక తీరేందుకు చలివేంద్రం దోహదం చేస్తుందన్నారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు, పీఏసీఎస్ సీఈవో బుచ్చాల జానయ్య, ఆర్‌ఐ దాడి రాజిరెడ్డి, మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలే అణగారిన వర్గాల హక్కుల పతాక

● ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జ్యోతిరావుపూలే అణగారిన వర్గాల హక్కుల పతాక అని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అన్నారు. మహాత్మాపూలే జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం వివిధ వర్గాల ప్రజలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. సబ్‌ కలెక్టర్ కార్యాలయం, విద్యుత్ డీఈ కార్యాలయం, బీసీ భవన్, సీపీఐ కార్యాలయం, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సాగర్‌రోడ్డులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక కార్యకర్త, కుల వ్యతిరేక సంస్కర్తగా పనిచేశారని అన్నారు. పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని నమ్మి విద్యావ్యాప్తికి విశేష కృషి చేశారని కొనియాడారు. పూలే ఆశయ సాధనలో ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలంలో పూలే చిత్రపటానికి సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, గాయం ఉపేందర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, దేశిడి శేఖర్‌రెడ్డి, సలీం, వెంకటేశంగౌడ్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు వస్కుల మట్టయ్య, ధనుంజయ నాయుడు, సత్యనారాయణ, నాగభూషణం, మురళి, జయరాజు, విద్యుత్ డీఈ శ్రీనివాసచారి, శ్రీనివాస్, ఏడీఏ రవీందర్‌రెడ్డి, విజయ్ కుమార్, ఆంజనేయులు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

● దేవరకొండలో ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాలు, బీసీ సంక్షేమసంఘం, బీజేపీ, వివిధ పార్టీల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. దేవరకొండ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట జ్యోతిరావుపూలే చిత్రపటానికి ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటచారి, సైదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ రాజరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

దామరచర్ల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కా ర్యదర్శి సందాల శంభయ్య, సరిత, సుజాత, నాగలక్ష్మి, సునీత, కవిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొంగరి సత్యనారాయణ, అమృతయ్య, సరోజినిదేవి, గౌసియా, లక్ష్మీరావు, రాము లు, వెంకటేశ్వర్లు, సాయిబాబా, స్వామి, శైలజ, పద్మ, సీఆర్పీ నాగసిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

హాలియాలో టీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారులు యడవల్లి రాంబాబు, మందా లక్ష్మి, యడవల్లి మణితేజ్, జయంత్‌రాం, చనగళ్ల చిన్నమారమ్మ, దేవిక, రోజా, సాత్విక్, మెగావత్ విష్ణుకుమార్, అంజికుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.యాదగిరి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ కాంతయ్య, రాజు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, కట్టబోయిన శ్రీనివాస్‌యాదవ్, యాదగిరి, నసీరుద్దీన్, టీచర్లు పాల్గొన్నారు.

పెద్దవూరలో తహసీల్దార్ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సుదీర్‌కుమార్‌లు జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ విగ్రహాల నిర్మాణ కమిటీ వ్యవస్థాపకుడు పులిమాల కృష్ణారావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆడెపు నాగార్జున, బీసీ నాయకులు వీరబోయిన వెంకటయ్య, నాయకులు బాల్యనాయక్, ఐతబోయిన వెంకటయ్య, వెంకటేశ్వర్లు, రవినాయక్, నాగయ్య, ముత్యాలు, కిరణ్, సత్యనారాయణ, మల్లయ్య, విద్యాసాగర్, ఎల్లయ్య, ప్రభాకర్, సైదులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : బాలునాయక్



మైనంపల్లిలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, అధికారులు

దేవరకొండ, కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం మైనంపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ, లబ్ధిదారులకు సన్నబి య్యం పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని కొండమల్లేపల్లి, మండల పరిధిలోని బాబ్లతండాలో, పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద, నేరేడుగొమ్ము మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రె స్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీ య భరోసా, రైతు భరోసా, సంక్షేమ పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారునికి ఆరు కిలోలు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అన్నారు. దేవ రకొండ మండలంలోని మైనంపల్లిలో పులిజాల మానసశ్రీనివా స్ ఇంట్లో అధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, హౌజింగ్ డీఈ నాగేశ్వర్, ఏఈ ఈశ్వర్, పీఆర్‌డీఈ లింగారెడ్డి, గౌతమిరాంసింగ్, ఆలంపల్లి నర్సింహ, సీఐ నర్సింహులు, హరికృష్ణ పాల్గొన్నారు.

మల్లేపల్లి, పీఏపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజురెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, వేమన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సైదులు, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల ఇబ్బందులు చూసిన ఆగ్రో ఫర్టిలైజర్ నిర్వాహకుడు బొల్లు గోవింద్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, సీఈవో వెంకటేశ్వర‌రెడ్డి, ఏవో పాండు, నాయకులు వీరబోయిన ఎల్లయ్య, సతీష్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, సత్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

డిండి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ఖాళీ సిలిండర్లతో ర్యాలీ చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లపై రూ.50 అదనంగా పెంచడం వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ పేదలకు అందిస్తుంటే కేంద్రప్రభుత్వం రూ.50 పెంచి సామాన్యులపై అదనపు భారం మోపిందన్నారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామిక వేత్తలకు లక్షల రూపాయల రాయితీలు ఇస్తు పేదలపై మాత్రం ఆర్థిక భారం మోపుతుందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, ఆర్థిక విధానాలు రోజురోజుకు దేశంలో అసమానతలను పెంచే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తూం బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, బొల్లె శైలేజ్, అనుమాండ్ల కేశవులు, గౌరటి వెంకటయ్య, నూనె వెంకటేశ్వర్లు, ఎలిమినేటి హుస్సేన్, చక్రి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, లక్ష్మారెడ్డి, నవీన్, వినయ్, వెంకటయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు

దేవరకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం రూ.6వేల పింఛన్ వెంటనే మంజూరు చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. దేవరకొండ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల హక్కుల పోరాటసమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే దివ్యాంగులకు పింఛన్ రూ.4 నుంచి 6వేలకు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ అమలుచేయలేదన్నారు. దివ్యాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, రాజీవ్ వికాసం పథకంలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 19వ తేదీన నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్, గుద్దేటి సైదులు, శ్రీరామదాసు వెంకటచారి, ఇందిరాచారి, కిషన్ లాల్, శేషగిరి పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి



రైతు సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, వేములపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం సంఘం కార్యాలయంలో ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1936 ఏప్రిల్ 11న రైతుసంఘం ఆవిర్భవించిన నాటి నుంచి రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందని అన్నారు. రైతుల పండించిన అన్నిరకాల పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు విమోచన చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, రెవిడాల పరశురాములు, ఊర్మిల, తిరుపతి, రాంమూర్తి, రమేష్, మల్లయ్య, గోవర్దన్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో రైతు సంఘం జిల్లా నాయకుడు పాల్వాయి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు రొండి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధని, వెంకటయ్య, వెంకన్న, సైదులు, లక్ష్మమ్మ సుకన్య పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు నిత్యం పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో చంద్రకళ అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాములపాడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, రజిని, ఉపాధ్యాయులు కరుణాకర్, గణిత, సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, జయమ్మ, ఆయాలు పాల్గొన్నారు.